www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025
5
తిరుపతి

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చున్నారు.

సామాన్యుడి గోస పట్టించుకోరా..?

- 300 రోజులుగా నిరసన దీక్షలు..!
- పేదలకు న్యాయం చేసే వరకు పోరాటం : సిఐటియు

శ్రీవారి మెట్టు చిరు ఉద్యోగులు కుటుంబ సభ్యులతో నిరాహార దీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:10 నెలల బాలుడి నుంచి 75 ఏళ్ల ముదుసలి వరకు కుటుంబ సభ్యులతో సహా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు ఆదివారం దీక్షను చేపట్టారు. స్థానిక కపిల తీర్థం రోడ్‌లోని టీటీడీ పరిపాలనా భవనం వద్ద జరుగుతున్న దీక్షలు 300 రోజుకు చేరుకున్న సందర్భంగా ఆదివారం పూర్తి రోజు నిరాహార దీక్షను చేపట్టారు. ఈ దీక్షలలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, కార్యదర్శులు ఎస్.జయ చంద్ర, పి. మునిరాజలతోపాటు వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు సామూహికంగా నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల కుటుంబాలలోని మహిళలు వారి పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఫాదర్స్ డే రోజున తండ్రుల పోరాటానికి మద్దతుగా పసిపిల్లలు డిమాండ్ల చార్టులను పట్టుకుని నినాదాలు చేయడం పలువురిని ఆకర్షించింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ చిన్న సమస్య పరిష్కారానికి వ్యాపారులు గత 300 రోజులుగా దీక్షలు చేస్తున్నా టిటిడి యాజమాన్యం గానీ, కూటమి ప్రభుత్వం గానీ పట్టించుకుని పరిష్కారం చేయకపోవడం అధర్మమని విమర్శించారు. టిటిడి చైర్మన్‌గా బిఆర్ నాయుడు బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి బోర్డు సమావేశంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల గురించి చర్చించామని సమస్యను పరిష్కరించామని స్వయంగా చైర్మన్ చెప్పిన తర్వాత కూడా సమస్యను పరిష్కారం కాకపోవడానికి కారణాలు ఏమిటో వెల్లడి చేయాలని కందారపు మురళి అన్నారు. టీటీడీ ఈఓ శ్యామలరావు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరిలు పలుమార్లు బాధితుల గోడు విన్నారని అయినా సమస్య పరిష్కరించడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం వీధుల్లో పోరాటం ఆనవాయితీ అయిందని, అటవీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మూడున్నర సంవత్సరాలు పాటు పోరాడామని, కూటమి హయాంలోనూ 300 రోజులు దీక్షలు పూర్తయ్యాయని, వైసీపీకి టిడిపి పాలనకు తేడా ఏమిటో బాధితులకు అర్థం కావడం లేదని విమర్శించారు. సమస్యల పట్ల సానుకూలంగా యాజమాన్యం స్పందించని పరిస్థితుల్లో చిరువ్యాపారులు కుటుంబాలతో సహా నిరవధిక దీక్షలకు పూనుకోవలసి వస్తుందని మురళి హెచ్చరించారు.

అఖిలపక్షం సంఘీభావం..

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పోరాటం 300వ రోజుకు చేరుకోవడంతో వారికి మద్దతుగా వివిధ రాజకీయ పక్షాల నేతలు హాజరై ప్రసంగించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, సిపిఐ నేత ఎన్ డీ రవి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నేత డీఎంసీ భాస్కర్ తదితరులు పాల్గొని మద్దతుగా ప్రసంగించారు. టీటీడీ యాజమాన్యం 300 రోజులుగా నిరసన దీక్షలు జరుగుతున్నా పట్టించుకోకుండా ప్రేక్షక పాత్ర వహించడం సమంజసమేనా? అని ప్రశ్నించారు. పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో కూడిన అత్యున్నత టీటీడీ వ్యవస్థలో పేదల ధర్మ పోరాటాన్ని ఇంతకాలం పట్టించుకోకపోవడం న్యాయం కాదన్నారు. బిఆర్ నాయుడు లాంటి వారు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు సామాన్యులకు వెసులుబాటు ఉంటుందని తాము భావించామని బిఆర్ నాయుడు హయాంలోనూ సామాన్యులకు రక్షణ లభించకపోవడం ధార్మిక సంస్థలో సరైనది కాదని అన్నారు. తక్షణం టీటీడీ పాలకమండలి యాజమాన్యం పేదలైన శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజా సంఘాల మద్దతు..

శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పోరాటానికి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి పి.సాయి లక్ష్మి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చినబాబు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ జి.నాగ వెంకటేష్‌లు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు చిట్టిబాబు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మధు, యుగంధర్, ప్రకాష్ రామ్మూర్తి, శేఖర్, నరసింహ, మల్లి, మల్లికార్జున్, రాంబాబు, చిరంజీవి, శివ, గణేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ మెడలు వంచేందుకు..

కార్మిక వర్గం కదం తొక్కాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథరెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మోడీ మెడలు వంచేందుకు కార్మిక వర్గం కదం తొక్కాలని, జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పాలు పంచుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలో ఏఐటియుసి 3వ ప్రాంతీయ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు ఈ సభలు జరగనున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హరినాథ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహం నుంచి అంబేద్కర్ భవన్ వరకు ర్యాలీని చేపట్టారు. అనంతరం నిర్వహించిన మహాసభలో కార్మికులనుద్దేశించి హరినాథ రెడ్డి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ లేబర్ కోడ్‌లతో కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తాయని, ఇందులో భాగంగానే రాష్ట్రంలో 10 గంటల పని విధానాన్ని బాబు సర్కార్ అమలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల కూలీ రేట్లు పెరగటం లేదనీ, చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని వాపోయారు. శ్రీకాళహస్తిలో మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తున్న ఎంఈఓ-2 బాలయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సొంత బావమరిది లాభం కోసం ఎంఈఓ అధికారాలను దుర్వినియోగం చేస్తున్న బాలయ్యపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, నాయకులు చిన్నం పెంచలయ్య, జనమాల గురవయ్య, కత్తిరవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ శ్రీ వర్ధంతిసందర్భంగా ఆదివారం వేమన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధానకార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ శ్రీ శ్రీ తన రచనల ద్వారా తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. వేమన విజ్ఞానకేంద్రం గౌరవ సలహాదారు టెంకాయల దామోదరం మాట్లాడుతూ శ్రీశ్రీ "మహాప్రస్థానం" తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించిందన్నారు. ఈకార్యక్రమంలో ముఖేష్, జయశంకర్, శివకుమార్, పద్మ, ప్రభాకర్, ఇమామ్, వినయలత, ప్రమోద్, ప్రసూన తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రమోషన్ బెల్ట్ టెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్ లోని తైక్వాండో ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం క్రీడా కారులకు ప్రమోషన్ బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రమోషన్ బెల్ టెస్ట్‌కు పరిశీలకులుగా విచ్చేసిన మాస్టర్ కె.గోపి నాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. మొత్తం 25 మందికి ప్రమోషన్ బెల్ టెస్ట్ నిర్వహించగా ఇందులో 10 మంది శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది పాల్గొని వివిధ బెల్టులు పొందడం ఆదర్శనీయమని తైక్వాండో సెంటర్ నిర్వాహకురాలు పి.గీతా తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సత్య చేతుల మీదుగా పలువురికి వివిధ బెల్టులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కోచ్‌లు భవ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

◆ బదిలీల్లో అన్యాయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మిగిలిపోయిన భాషా పండితులకు వెబ్ కౌన్సిలింగ్ ద్వారా చేపట్టిన బదిలీలల్లో తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టిఏ) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్ సిబ్బాల కిరణ్ కుమార్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీలల్లో వారి సీనియారిటీ జాబితాకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్ పెట్టుకున్నప్పటికీ వారు కోరుకున్న పాఠశాల కాకుండా దూరంగా ఉన్న పాఠశాల బదిలీ చేశారన్నారు. వీరి కంటే సీనియారిటీ జాబితాలో చివరిలో ఉన్న వారికి సమీపంలో రావడం జరిగిందన్నారు. దీంతో మిగిలిపోయిన భాషా పండితులు మానసిక ఆవేదనకు గురి అవుతున్నారన్నారు. వారికి న్యాయం జరగాలంటే సత్వరమే వెబ్ కౌన్సిలింగ్ ద్వారా జరిగిన బదిలీలను రద్దుచేసి, మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు బదిలీలలో స్థానభ్రంశానికి గురవుతున్న వీరికి శాశ్వతంగా న్యాయం జరగాలంటే సత్వరమే పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాషా పండితులు కనక సభాపతి, కమలాక్షి, శరవణ తదితరులు పాల్గొన్నారు.

◆ అరవ జయపాల్‌కు అవార్డు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రముఖ కవి, సీనియర్ పాత్రికేయులు, ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయపాల్ కు "తెలుగు తేజం" జాతీయ అవార్డు లభించింది. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవి కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులో ఆయనను ఘనంగా సత్కరించారు. శ్రీ నాగయ్య కళాక్షేత్రంలో తెలుగు తేజాలకు కళాభిషేకం, కళాకారుల సమ్మేళనం, జాతీయస్థాయి ద్వి శతాధిక కళాకారుల మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. విద్య, సాహిత్యం, కళలు, జర్నలిజం, సమాజసేవా రంగాల్లో అరవ జయపాల్ బహుముఖ సేవలందిస్తున్నారని వక్తలు ప్రశంసించారు. తన సేవలను గుర్తించి 'తెలుగుతేజం' జాతీయ అవార్డుతో సత్కరించడం పట్ల జయపాల్ ధన్యవాదాలు తెలిపారు.

◆ మంత్రికి ముక్కంటి ప్రసాదాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ జన్మదినం సందర్భంగా శ్రీకాళహస్తికి చెందిన జనసేన నాయకులు పసుపులేటి నవీన్ కుమార్ ఆదివారం ముక్కంటి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కలంకారీ శాలువాకప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలనీ, రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు.

◆ వాహనాలు కండిషన్‌లో ఉండాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నడిపే అన్ని బస్సులు పూర్తి కండిషన్లో ఉండాలని టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన టూ టౌన్ పరిధిలో ఉన్న పలు ప్రైవేటు స్కూళ్లలో పర్యటించి బస్సులను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డ్రైవర్ల వివరాలను ఆరా తీశారు. బస్సులు కండిషన్లో ఉండటంతో పాటు లైసెన్సులు, ధ్రువపత్రాలు ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులను బస్సులో తీసుకెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ స్కూలుకు, గమ్యస్థానాలకు జాగ్రత్తగా చేర్చాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ నారాయణలో ఏఐ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈసిఈ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు రీసెంట్ అడ్వాన్స్మెంట్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఫ్యాకల్టీ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. పలు జిల్లాలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ నూతన మార్పులపై అధ్యాపకులు ఎప్పటికప్పుడు వారి ఆలోచనలను పెంపొందించుకొని, ఒకరికొకరు పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీరజ ,శక్తి మురుగన్, పలు కాలేజీలకు చెందిన హెచ్ డిలు పాల్గొన్నారు.

◆ 'వెన్నుపోటు' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: '5కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు' పుస్తకాన్ని తిరుపతి, చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజాలు ఆవిష్కరించారు. స్థానిక పద్మావతి పురంలోని కరుణాకర్ రెడ్డి నివాసంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎమ్మెల్యే సునీల్, విజయానంద రెడ్డి, నూకతోటి రాజేష్, తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు చవ్వా రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'అంకితం.. నీకే అంకితం'

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభిస్తున్న సినీ నటి ఇంద్రజ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం జన్మదిన సందర్భంగా నిర్వహించిన అంకితం నీకే అంకితం సంగీత కార్యక్రమం ప్రేక్షకులను ఆలరించింది. స్థానిక మహతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీనటి, జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ యాంకర్, జడ్జి ఇంద్రజ విచ్చేశారు. ఆమెతో పాటు సినీ నిర్మాత ఎలమంచిలి ప్రవీణ్, యోగ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యోగేష్, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షులు వైఎస్ బాబు, చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన కావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాయని, గాయకులు ప్రవస్తి, స్నిగ్ధ, శృతి శ్రావణి, సురభి శ్రావణి, రేణుకుమార్ నరసింహ, ఉదయ భాస్కర్ తదితరులు వారి గానాలాపనతో సభికులను ఆలరించారు. అనంతరం సినీనటి ఇంద్రజను తిరుపతి ఫిలిం సొసైటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్పీ బాల సుబ్రమణ్యం జన్మదిన సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొనడం తన భాగ్యమని, తిరుపతి ఫిలిం సొసైటీ వారు ఇటువంటి గొప్ప గాయకుల్ని గుర్తుపెట్టుకుని వారి పేరు మీద ఇటువంటి కార్యక్రమాలు ఇంకా నిర్వహించడం గర్వకారణమని అన్నారు. ఎంతోమంది గాయని, గాయకులను ప్రేక్షకులకు పరిచయం చేసిన ఘనత ఎస్పీ బాలసుబ్రమణ్యంకి దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిరుపతి ఫిలిం సొసైటీ తిరుపతికి ఒక బహుమతి అని, ఈ వేదికను గాయని గాయకులు అందరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రముఖ నిర్మాత ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ సంగీతం అనేది పామరును కూడా కదిపి వేస్తుందని, అలాగే సంగీతంతో రోగాలు కూడా నయమవుతాయన్నారు. అధ్యక్షులు వైఎస్ బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఇంద్రజాని ఆహ్వానించడం, ఆమె ఆ కోరికను మన్నించి ఇక్కడికి విచ్చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జనమిత్ర దిలీప్ కుమార్ రెడ్డి, ఇన్చార్జి సెక్రటరీ శాంతావాణి, వైస్ ప్రెసిడెంట్ బుచ్చిబాబు, కోశాధికారి ప్రసాద్ రావు, మధుసూదన్ రెడ్డి, గుల్జార్ ఘోస్ట్ తదితరులు పాల్గొన్నారు.

భూమి జానెడు.. భవనం బారెడు..!

- తిరుపతిలో అక్రమంగా భవన నిర్మాణం
- 30 అంకణాల స్థలంలో ఏడంతస్తుల మేడ
- కార్పొరేషన్ అధికారుల మౌనం..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రమెట్ట రాయల్ నగర్ సమీపంలోని లీలామహల్ సర్కిల్ ఎస్బిఐ బ్యాంక్ వద్ద ఏకంగా ఏడంతస్తుల భవనం నిర్మాణ పనులు చేపట్టారు. ఈ భవనానికి టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి ఇచ్చారా లేదా అనేది తెలియాల్సి ఉంది. అంత పెద్ద నిర్మాణం జరుగుతున్నా కార్పొరేషన్ అధికారులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత కొన్ని నెలలుగా నిర్మాణ పనులు జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ నిర్మాణాలు అనుమతి ఇచ్చారా? లేక రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో మౌనంగా ఉన్నారా అనేది ప్రశ్నార్థకం. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తులు మాత్రమే అనుమతులు ఇస్తారు. ఆ తరువాత అదనపు అంతసు నిర్మాణం చేపట్టాలంటే, అనుమతి తీసుకుని నిర్మించాల్సి ఉంటుంది. అదికూడా అగ్నిమాపక శాఖ తోపాటు, తుడా అనుమతి ఇచ్చిన తర్వాత నిర్మాణాలు చేపట్టాలి. అయితే కార్పొరేషన్‌లో ఇటీవల కాలంలో విచ్చలవిడిగా నిర్మాణ పనులు అనుమతి లేకుండా జరుగుతున్నాయి. ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో అక్రమ నిర్మాణ పనులపై ఫిర్యాదు అందుతున్నా, వాటిపై చర్యలు మాత్రం శూన్యం. సచివాలయ ప్లానింగ్ అధికారులు కొంతమంది అక్రమ కట్టడాల యజమానులతో కుమ్మక్కై అనుమతులు ఇస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. సచివాలయంలో ఉండే ప్లానింగ్ అధికారులను ఎంతకూ బదిలీ చేయకుండా గత మూడేళ్ల కాలం నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తుండటంతో అక్రమ కట్టడాదారులతో వారు కూడా కలిసిపోవడం అవినీతికి ఆస్కారం ఇస్తోంది. తిరుపతి నగరంలో ఏడంతస్తుల భవనం నిర్మించాలంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకొని ఆ తర్వాత తుడా మున్సిపల్ కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్లి నిర్మాణాలు చేయాల్సి ఉంది. నగరంలో ఇంత పెద్ద ఎత్తున నిర్మాణం జరుగుతుంటే దానిపై టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం పలు అనుమానాలకు తావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా అవినీతి మయమయింది. విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి వారి దగ్గర పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ప్రభుత్వ మారినా కూడా కొంతమంది ప్లానింగ్ విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బంది చేతులు తడపందే అనుమతులు ఇవ్వడం లేదని సమాచారం. కమిషనర్ మౌర్య స్పందించే ఈ నిర్మాణంపై అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

7 అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఉందా..?

ఈ నిర్మాణం పూర్తయితే, నివాసం ఉండే వారికి సరైన వెలుతురు కూడా ఈ భవనంలో ఉండేటట్టు లేదు. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఫైర్ ఇంజన్ లోపలికి వచ్చే పరిస్థితి లేదు. మొదటి రెండు అంతస్తులు వాణిజ్య విభాగానికి ఉపయోగించి, మిగతావి కార్యాలయానికి ఇస్తారా లేదా నివాసాలకు ఇస్తారా అనేది తెలియాల్సిఉంది. ఇటీవల మంగళం సమీపంలో మూడు అంతస్తుల నిర్మాణం అనుమతులు తీసుకొని ఐదు అంతస్తులు నిర్మించారు. ఈ నిర్మాణ పనులు చేసిన భవన నిర్మాణ కార్మికులు ఇద్దరు పైనుంచి కింద పడి చనిపోయిన విషయం కలకలం సృష్టించింది. సోమవారం కార్పొరేషన్ పరిధిలో జరగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదికలో పరిసర ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేయనున్నారు.

అక్రమ నిర్మాణానికి నోటీసులు ఇచ్చాం : టిపిఓ మూర్తి

నగరంలో ఏడంతస్తుల భవనం నిర్మాణానికి తాను అనుమతి ఇవ్వలేదని, తాను కొత్తగా వచ్చానని, ఆ భవనాన్ని పరిశీలించి నోటీసులు కూడా ఇవ్వడం జరిగిందని టౌన్ ప్లానింగ్ అధికారి మూర్తి ప్రజాశక్తికి తెలిపారు.

పశు వైద్యాధికారిణిగా మోహన కుమారి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు పశు వైద్యాధికారిణిగా డాక్టర్ మోహన కుమారి పదవి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల సాధారణ బదీలలో భాగంగా ఏర్పేడులో పశు వైద్యాధికారినిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శిల్పారెడ్డి ఏర్పేడు మండలంలోని ఎండి పుత్తూరు పశు వైద్యాధికారిణి గా బదిలీ కాగా, పాకాల మండలం కే.వడ్డేపల్లి విధులు నిర్వహించిన మోహన కుమారి ఏర్పేడుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడి రైతుల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను, ఏర్పేడు మండలంలో పశు సంవర్ధక శాఖ సేవలు రైతులకు సక్రమంగా అందేవిధంగా కృషి చేస్తానని ఆమె తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -ఏర్పేడు : యండి పుత్తూరులో నారాయణాద్రి హాస్పిటల్స్ బృందం ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది. వందమందికి పైబడి వైద్యపరీక్షలు నిర్వహించగా వీరులో 60 మందికి ఈసిజి తీసి తగిన వైద్య సహాయమందించి మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో నారాయణాద్రి హాస్పిటల్స్ వైద్య బృందం డాక్టర్ కీర్తన, దీన కుమార్, ప్రియా, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు మాన్య శ్రీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్ యోగా - ధ్యాన సొసైటీకి చెందిన మాన్యశ్రీ యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని యోగా మాస్టర్ ఎస్.థామస్ తెలిపారు. ఆదివారం ఉదయం అరణియార్ యోగా - ధ్యాన సొసైటీ కేంద్రంలో యోగా సాధన పూర్తయిన తర్వాత మాన్యశ్రీ ని మాస్టర్, సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అరణియార్ యోగా - ధ్యాన సొసైటీ సభ్యులు గోవిందన్, దొరవేలు,మునిరాజలు పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ గౌడ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం నగరంలోని ప్రముఖ హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటుడు సుమన్ విచ్చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ భవిష్యత్తులో నారాయణ గౌడ్ మంచి నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకుంటాడని కితాబిచ్చారు. అంబేద్కర్ న్యాయ కళాశాల అధినేత డాక్టర్ తిప్పారెడ్డి, దంపురు భాస్కర్ యాదవ్, ఎస్వీయు ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఆచార్య పద్మినిలు మాట్లాడుతూ నారాయణ గౌడ్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ఈ వేడుకల్లో డాక్టర్ వెంకట్ నారాయణ, డాక్టర్ కిషోర్ కుమార్ యాదవ్, డాక్టర్ నరేందర్ రెడ్డి, ప్రియవర్ధన బాబు, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తల్లికి వందనం అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ 19 వ వార్డు ఇంచార్జ్ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్, గాలి భాను ప్రకాష్ చిత్ర పటాలకు ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మెరుపుల మహేష్, పుత్తూరు మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో19 వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి ఉషారాణి, వార్డు ఉపాధ్యక్షులు మోహన్ కృష్ణ, ఐటిడిపి అధ్యక్షులు సురేష్, పెంచలయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



ఇంటింటి ప్రచారంలో అనుపల్లి మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని అనుపల్లి మోడల్ స్కూల్ హెచ్ఎం దుర్గాప్రసాద్ కోరారు. ఆదివారం మండలంలోని అనుపల్లి పంచాయతీ బొప్పరాజుపల్లిలో పూర్వపు విద్యార్థులతో కలిసి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పేద విద్యార్థులకు బోధన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు సోము, విజయ్ కుమార్ రెడ్డి, జవహర్, రమణ రెడ్డి, కుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలల ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సోమవారం ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నూతన విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు బీకాం, బిఎ, బిఎస్సి తదితర కోర్సుల్లో రెండు ప్రధానమైన సబ్జెక్టులతో కూడిన డబుల్ మేజర్ విధానం అమలులోకి రానుందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - నాగలాపురం: మండలంలోని జానికాపురం గ్రామంలో శ్రీ అంకాల పరమేశ్వరి దేవాలయ ఆవరణలో డా.ముత్యాల చిన్ని కృష్ణుడు మెమోరియల్ ట్రస్ట్ నేతృత్వంలో తిరుపతి డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి, చెన్నై దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని నాగలాపురం డాక్టర్ రామచంద్రన్ ఆదివారం ప్రారంభించారు. కంటి, పంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అగర్వాల్ కంటి ఆస్పత్రి డాక్టర్ ఆరిఫ్, దంత వైద్యులు భానుప్రియ, డాక్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు బజారి వీధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుండి పదవ తరగతి వరకు కలిసి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. 1974 - 75 విద్యా సంవత్సరం 10 వ తరగతి పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ సరళ సుకుమార్, అగ్నిస్, అశ్విని వాణి, బాలాజీ, స్వాతి, దేవి, మంజు తదితరులు పాల్గొన్నారు.

కాయ్.. రాజా కాయ్

ప్రాణాలు పోతున్నా.. దోచెయ్..!

ఓ పక్క ప్రాణాలు పోతున్నా ఈజీ మనీ కోసం జూదరుల తాపత్రయం ఆగడం లేదు. అన్ని తెలిసినా కూడా అధికారులు పట్టించుకోక పోవడంతో లాటరీ వ్యాపారులు మరింతగా పెట్రేగిపోతున్నారు. లాటరీ వ్యాపారం ఓపెన్ సీక్రెట్‌గానే నడుస్తోంది.. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్నది ప్రజల ఆరోపణ. ఈజీగా మనీ వస్తుందన్న ఆశతో జూదరులు లాటరీలపై డబ్బు తగలేస్తూ అప్పుల పాలైపోతున్నారు. చివరికి అప్పులు బాధ భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు.

- ప్రజాశక్తి - నాయుడుపేట

- ప్రాణాలు పోతున్నా మారని జూదరులు
- వీధి వీధినా సింగిల్ నెంబర్, లాటరీ టికెట్ల విక్రయాలు
- ఆత్మహత్యలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

నెల్లూరు, చెన్నై, తిరుపతి నగరాలకు కూడలి ప్రాంతమైన నాయుడుపేటలో వీధి వీధినా సింగిల్ నెంబర్ లాటరీ జోరుగా సాగుతోంది. అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న ఆశ జూదరుల పాలిట శాపాలుగా మారుతోంది. ఈ మధ్య పట్టణంలో లాటరీ, సింగిల్ నంబర్ల టికెట్ల కొనుగోళ్లలో అప్పుల పాలై పేదవాళ్ళు ఆత్మహత్యలు జరుగుతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సింగిల్ నంబర్ లాటరీ ఎప్పుడో ఒకసారి ఎవరో ఒక్కరిని వరించి వచ్చే అదృష్టం. అది ఎంతోమంది పాలిటి శాపంగా మారుతుంది. తెలుగు రాష్ట్రాలలో లాటరీలను అధికారికంగా నిషేధించినప్పటికీ, చాలా చోట్ల విచ్చలవిడిగా జరుగుతూనే ఉంది. ఛోటా, మోటా నాయకుల అండదండలు లాటరీ నిర్వాహకులకు ఉన్నాయనే అనుమానం ప్రజల్లో ఉంది. కాయ్ రాజా కాయ్, బోడోలాండ్ లాటరీ, మేఘాలయ లాటరీ, విజయవాడ సింగిల్ నెంబర్, చెన్నై సింగిల్ నెంబర్ అంటూ వ్యాపారులు ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారు. నెల్లూరు తిరుపతి ఉమ్మడి జిల్లా నాయుడుపేటలో లాటరీలు, సింగిల్ నంబర్లు ఆడి అప్పులు పాలై ఇటీవల ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాలోని నాయుడుపేట కేంద్రంగా సింగిల్ నంబర్లు, కాటన్, బోడోలాండ్ లాటరీలు, మేఘల్యాండ్ లాటరీ టికెట్ల విక్రయాలకు కేంద్రంగా మారింది. నాయుడుపేట ప్రధాన ఏరియాల్లో అనేక చోట్ల కాటన్, సింగిల్ నెంబర్లు లాటరీ టికెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కాయ్ రాజా కాయ్ పది రూపాయలు సింగిల్ నెంబర్‌కు 850 విజయవాడ బ్రాంచ్ అందిస్తుండగా, కాటన్ చెన్నై 10 రూపాయలకి 800 రూపాయలు ఇస్తున్నట్లు సమారం. ఇలా తక్కువ పెట్టుబడితో ఎక్కువ మొత్తం వస్తుండడంతో అధిక శాతం ప్రజలకు లాటరీలకు బానిసలవుతున్నారు. ఈ లాటరీలకు బలయ్యేది ఎక్కువగా పేదవారే. అత్యాశకు పోయి ఒక్కొక్కరు రోజులో వంద నుంచి వెయ్యి రూపాయలు వరకు ఇందులో కడుతూ కాయ కష్టం చేసి సంపాదించిన డబ్బును నాశనం చేసుకుంటున్నారు. ప్రజలను ఆకర్షించేందుకు వ్యాపారస్తులు లాటరీ విక్రయాలలో అనేక విధాలా గారడీలకు పాల్పడుతున్నారు. కేరళ జాక్పాట్ నాలుగు అంకెలకు 120 రూపాయలు చెల్లించి కొనుగోలు చేసినవారికి అదృష్టం వరిస్తే 5 లక్షల రూపాయలు ప్రైజ్ మనీ వస్తుందనే ఆశ చూపించి టికెట్లు కొనిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అదృష్టం బాగుండి లాటరీ తగిలితే అందులో విక్రయిదారుడు లక్ష రూపాయలు పట్టుకొని నాలుగు లక్షల రూపాయలే లాటరీ విజేతకు అందిస్తారు. ఈ విధంగా కూడా జూదరులను దోచుకుంటున్నారు. నాయుడుపేటలో నడుస్తున్న లాటరీల విషయమై పట్టణ సీఐ బాబీని వివరణ కోరగా ఆయన వద్ద నుంచి సరైన స్పందన రాకపోవడం గమనార్హం. ఇది అసలు సమస్యే కానట్టు దీనిపై ఆయన స్పందించాల్సిన అవసరం లేనట్టు ఆయన సమాధానం ఇచ్చారు. ఎంతో మంది జీవితాలు నాశనం చేసి ప్రాణాలు తీస్తున్న లాటరీ వ్యవస్థపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి

తాస్ జ్యూస్ ఫ్యాక్టరీలో.. మామిడి రైతులకు లభించని గిట్టుబాటు ధర

నిరసన తెలుపుతున్న రైతులు, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గత నెల రోజులుగా రైతులు, రైతు సంఘాలు చిత్తూరు జిల్లా పూతలపట్టు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులు మామిడి రైతుల సమస్యలను పరిష్కరించడానికి పలుదపాలుగా చర్చలు జరిపి మామిడి కాయలకు టన్నుకు తోతాపూరి 12 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ తాస్ జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల దగ్గర్నుంచి నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కేజీ మామిడికాయలకు 8 రూపాయలు నిర్ణయించినప్పటికీ, ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు ఆరు రూపాయలే ఇస్తామంటున్నారు. మిగిలిన రెండు రూపాయలు ఫ్యాక్టరీ యాజమాన్యం జేబులోకి వేళ్లేందుకు కమిషన్‌గా వదిలెయ్యాలా అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్, డి మహేష్, జిల్లా నాయకులు నాగరాజులు విమర్శించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలని రైతులు నాయకులు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలు సిండికేటయ్యి రైతుల దగ్గర్నుంచి ఆరు రూపాయలకు కొనుగోలు చేస్తామని బెదిరిస్తున్నారని, ఇంతజరుగుతున్నా ఇన్చార్జి మంత్రికి చీమ కుట్టినట్టు కూడా లేదా అని రైతు సంఘం నాయకుల ప్రశ్నించారు. ఫ్యాక్టరీ యజమానులు నిర్ణయించిన ధర చెల్లించకుంటే వారి ఫ్యాక్టరీలు ఎందుకు సీజ్ చేయడంలేదని ప్రశ్నించారు. యజమానులతో అధికారులు, నాయకుల కుమ్మక్కయ్యారని ఆరోపించారు. శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఫ్యాక్టరీ దగ్గరకు వెళ్లి పరిశీలించి ఎనిమిది రూపాయల చెల్లించి మామిడి కోనాల్సిందేనని ఆదేశాలు ఇచ్చినా అవి అమలు కావడంలేదని ఆవేదన్నారు. కాలయాపనతో మామిడికాయ చెట్లను నుండి కాయ రాలిపోతోందని, రైతులు నష్టానికి గురై, అప్పులు పాలవుతారని రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించని పక్షంలో ఫ్యాక్టరీలను సీజ్ చేయాలని, ఇతర రాష్ట్రాల నుండి మామిడి దిగుమతి అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు దేశయ్య, టి భాస్కర్, చందు, రామచంద్ర రాజు, సుబ్రహ్మణ్యం, సుబ్బు రామరాజు సిద్దేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 77న రద్దు చేసి అరులైన వారందరికీ ఫీజు రీఎంబర్స్మెంట్ పథకం అమలు చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్ కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15,16 తేదీలలో తిరుపతి పట్టణంలోని పిడిఎస్యూ రాష్ట్ర కార్యాలయంలో జరుగుతున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీలు పూర్తిచేసుకుని ఉన్నత చదువులకు వెళ్లాలి అనుకునే వారికి 77 జీవో తీవ్ర అడ్డంగా ఉందన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మిగిలిన విద్యార్థి సంఘాల కలుపుకుని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.రాజశేఖర్, ఎం. సునీల్, ఎస్.కె జునైద్ బాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరేంద్ర, రాష్ట్ర కోశాధికారి మహేంద్ర బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మానస, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

104 ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం సభ్యులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, పిచ్చాటూరు: తిరుపతి జిల్లా 104 ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో అమరనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి 104 ఉద్యోగులకు రావాల్సిన బకాయి వేతనాలు ఇతర బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అమరనాథ్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎంపిక నిర్వహించారు. అధ్యక్షులుగా అమర్నాథ్, కార్యదర్శిగా రుద్ర, ఉపాధ్యక్షులుగా యశ్వంత్‌గ కోశాధికారిగా భువనేశ్వరి, సహాయ కార్యదర్శిగా దివాకర్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా రుష్యేంద్ర, అశోక్‌లను, డివిజన్ కార్యదర్శులుగా తిరుపతి-యోగేంద్ర, సురేష్, పిచ్చాటూరు - చెంచురాజు, నాయుడుపేట-రమణ కోటిలను ఎన్నుకున్నారు.

ఏఐటియుసికి ఎంబేటి రాజీనామా



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఏఐటియుసి నియోజక వర్గ అధ్యక్షులు ఎంబేటి చంద్రయ్య తన పదవికి ఆదివారం రాజీనామా చేశారు. ఆయన మాట్లాడుతూ 2020లో పార్టీ సభ్యత్వం ఇచ్చి ఆ తర్వాత ఏఐటియుసి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఇప్పటివరకు సహకరించిన జిల్లా పార్టీ, నియోజవర్గ నాయకులు, ప్రజా సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్య కారణాల రీత్యా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఏఐటియుసి బాధ్యతలకు రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

ఏది జరిగినా ఎమ్మెల్యేకి ఆపాదించడం సరికాదు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఏ సంఘటన జరిగిన అది నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆపాదిస్తూ విమర్శించడం మంచి పద్ధతి కాదని, తిరుచానూరు, దామినేడు వద్ద జరిగిన సంఘటనలకు సంబంధించి వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు వైసిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సూచించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఏ మూల ఏమి జరిగినా అది పులివర్తి నానినే చేశారని ప్రజల్లోకి తప్పుడు సంకేతాన్ని పంపించాలని ప్రయత్నం చేస్తున్నారని, కానీ వాస్తవాలు ప్రజలకు తెలుసన్నారు. టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన మఠం భూములను ఆక్రమించి అమ్మేసిన ఘనత చెవిరెడ్డి కుటుంబానికి దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో కత్తి సుధాకర్, శ్రీనివాసులు, మధుశేఖర్ పాల్గొన్నారు.

పగటి వేషాలు మానండి : నరసింహ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, వైసీపీ నాయకులు పగటి వేషాలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఇకనైనా ప్రజా పాలనకు సహకరించాలని రాష్ట్ర యాదవ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ సూచించారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి సమానంగా ప్రోత్సాహకాన్ని అందించడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించిందన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు వెన్నుదన్నుగా నిలుస్తారన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, సీనియర్ నాయకులు శ్రీధర్ వర్మ, సుధాకర్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కావ్య సర్జికల్ మెడికల్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ప్రజల ఆరోగ్యమే ప్రధానమని, ఆదాయం ఆ తర్వాతేనని ప్రముఖ మందుల పంపిణీ సంస్థ కావ్య సర్జికల్స్ అండ్ మెడికల్ ఆరోగ్య పరికరాలు సర్వీస్, సేల్స్ హెల్త్ సర్వీసెస్ సంస్థ అధినేత, మాజీ స్విమ్స్ సీనియర్ అనస్థీషియా నిపుణులు పి.విజయబాస్కర్ తెలిపారు. తిలక్ రోడ్డు ఆర్కె స్టూడియో దగ్గర ఉన్న కావ్య సర్జికల్ మెడికల్ షోరూం ఆదివారం ప్రారంభించారు. ఆయన ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా వైద్యుల సలహాలు, సూచనల మేరకు మా సంస్థ నుంచి ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాలను సరఫరా చేస్తున్నామన్నారు. కావ్య సర్జికల్స్ స్థాపించి, నాణ్యమైన పరికరాలను తక్కువ ధరలకు అందిస్తూ అందరి మన్నలను పొందామన్నారు. మా సంస్థలో ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, స్టెతస్కోప్లు, బిపి మీటర్లు, "వీల్చైర్లు, వాకర్లు, షుగర్ పరీక్ష యంత్రాలు, ల్యాబ్‌లకు అవసరమైన వివిధ పరికరాలు, ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను అందిస్తున్నామన్నారు. యుఎస్ఏలో ఎంఎస్సి సైకాలజీ చేసిన శ్రీవిద్య పర్యవేక్షణలో నర్సింగ్ సేవలను సైతం రోగులు వారి ఇళ్ల వద్దనే అందించే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. దీన్ని ప్రతి ఒకరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 850020615 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

మండల స్థాయి సమన్వయ సమావేశం

ప్రజాశక్తి -ఏర్పేడు : టిడిపి, జనసేన మండల స్థాయి సమన్వయ సమావేశం ఆదివారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకుల ఏకతాటిపై ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు అండగా ఉండేలా కార్యచరణ చేయాలని చర్చించారు. అనంతరం మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు పేరం చిరంజీవులు నాయుడు ఇరువురికి జనసేన నాయకులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఏర్పేడు మండల అధ్యక్షులు రామ్ శెట్టి కిరణ్ కుమార్, పాడి వంశీకృష్ణ, కావాలి ముని కుమార్, మొరస పవన్ కుమార్, శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -ఏర్పేడు : యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో చిందేపల్లి ఎస్టీ కాలనీ పిల్లలకు విద్యా సామగ్రి, బాంబినో పాస్తా ఫుడ్స్ పంపిణీ చేయడం జరిగిందని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మునిశేఖర్, అధ్యక్షులు వినోద్‌లు తెలిపారు. గిరిజన పిల్లలు బాగా చదువుకుంటేనే ఎస్టీ కాలనీలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి యువనేస్తం అసోసియేషన్ దాతల సహాయంతో కృషి చేస్తుందని, గిరిజన పిల్లలకు సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అరుణ, వాలంటరీ మౌనిక పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల గౌరవంగా నడుచుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సమాజంలో ప్రతిఒక్కరూ వృద్ధులపట్ల గౌరవంగా నడుచుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జీ వెంకటనాగపవన్ సూచించారు. ఆదివారం గూడూరు మండలం, పోటుపాళెంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ జడ్జి రాజేష్, ఎస్ఐ మనోజ్ కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేస్తాం

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలం వైసిపి పార్టీకి సంబంధించి బీసీలకు కమిటీలలో ఎక్కువ స్థానాలు కల్పించడం సంతోషదాయకమని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. మాజీ శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి బీసీల మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. పార్టీ అభివృద్ధికి మండలంలో బీసీల అందరం కలసికట్టుగా పనిచేస్తామన్నారు. యువ నాయకులు వినోద్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి మండల అధ్యక్షుడు రమణ యాదవ్, ఉపాధ్యక్షుడు ముని కృష్ణారెడ్డి, జనరల్ సెక్రెటరీ రమయ్యాచారి సెక్రటరీ మునిరత్నంలను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, మనీ, మునిశేఖర్, కేశవులు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

డ్రైవర్ నిద్ర మత్తు.. లారీ బోల్తా

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, చిల్లకూరు, వడ్డీ పాలెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున నాయుడుపేట నుండి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న సిమెంట్ బల్గర్ లారీ అతివేగంగా వెళుతూ బోల్తాపడి, అవతలి వైపు డివైడర్ నుండి యువతల (నాయుడుపేట వైపుకు) సర్వీస్ రోడ్డు ప్రక్కన వచ్చి పడింది. డ్రైవర్ నిద్ర మత్తుతో లారీ నడపడమే కారణమని స్థానికుల సమాచారం. ఈ ప్రమాదంలో డ్రైవర్ సెంథిల్ కుమార్(35) కు స్వల్ప గాయాలయ్యాయి. హైవే మొబైల్, స్థానికుల సమాచారంతో పెళ్లకూరు పోలీస్ వారు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కోట : కోట మండలం, తిన్నెల పూడి గ్రామ పంచాయతీ, పంట పొలాలలో విద్యుత్ షాక్ తో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. చెందోడు పంచాయతీ విద్యుత్తు ఏఈ శశికళ ఇచ్చిన సమాచారం మేరకు కోట ఎస్సై పవన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సిబ్బంది, స్థానికుల సహాయంతో చనిపోయిన వ్యక్తిని స్తంభంపై నుండి కిందకి దించారు. మృత దేహాన్ని పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు ఇంకా తెలియలేదన్నారు. విద్యుత్తు లైన్ మాన్, తిన్నెలపూడి రైతుల సమాచారం మేరకు రాత్రుళ్లు విద్యుత్తు వైర్లు దొంగతనానికి వచ్చి, రెండు వైర్లు పూర్తిగా కట్ చేసి ఉన్నారని, ఒక వ్యక్తి మృతి చెందడంతో మిగతావారు పారిపోయి ఉండవచ్చునని తెలియజేశారు.

డివైడర్‌ను ఢీకొన్నకారు.. 9 మందికి గాయాలు

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండల పరిధి, పెన్నేపల్లి సమీపంలోని 71వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు ఐరన్ డివైడర్‌ను ఢీకొనింది. కారులో తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లా, మిర్యాలగూడకు చెందిన వారు ప్రయాణిస్తున్నారు. తిరుమల దైవ దర్శనం అనంతరం, కాణిపాకానికి వెళ్లి, అక్కడి నుండి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 9 మంది గాయాల పాలయ్యారు. డ్రైవర్ మధుసూదన రెడ్డి (37) సతీష్ రెడ్డి(41) జానకి రెడ్డి (59) వరమ్మ (51) కలమ్మ (45) సరిత (38) కృష్ణమ్మ(43) పిల్లలు సహర్ష(10) హంసిని (7) గాయాలకు గురయ్యారు. పిల్లల పరిస్థితి కొంత తీవ్రంగా ఉండడంతో ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏడుగురు స్వల్ప గాయాలతో బయటపడగా వారిని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పెళ్లకూరు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలియజేశారు.

ఒడిశా యువకుడి అదృశ్యం

అదృశ్యమైన బిస్వాల్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. స్థానిక ఇటుక బట్టీల్లో కార్మికుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ బిస్వాల్ (22) గత నెల 6వ తేదీన అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి బిస్వాల్ ఆచూకీ కోసం బంధు వులు, తోటి కార్మికులు అతని స్వస్థలంతో పాటు శ్రీకాళహస్తి పరిసరాల్లో గాలించారు. అయినా బిస్వాల్ ఆచూకీ లభించక పోవడంతో కుటుంబీకులు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బిస్వాల్ ఆచూకీ తెలిసిన వారు 944 0900008 నంబరుకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

మంత్రి జన్మదినం సందర్భంగా రక్తదానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని, నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు ఆధ్వర్యంలో స్విమ్స్ బృందంచే రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ఎంఆర్ పల్లి నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కొండలరావు మాట్లాడుతూ అన్ని దానాలలోకన్నా రక్తదానం గొప్పదని, తమ సంస్థ ఉద్యోగులందరూ, వ్యవస్థాపక చైర్మన్ నారాయణ జన్మదినాన్ని ఏదో సాధారణంగా కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడే విధంగా జరుపుకోవాలని నిర్ణయించమన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మందికి పైగా నారాయణ ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేసారు. అనంతరం రేణిగుంట అభయ క్షేత్రంలోని మానసిక వికలాంగులకు, రుయా ఆసుపత్రి వద్ద రోగులకు వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టంబేడు మండలం ఎస్సైగా రామాంజనేయులు

ప్రజాశక్తి - తొట్టంబేడు: తొట్టంబేడు మండలం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా తొట్టంబేడు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా వచ్చారు.

జనసేన పార్టీ సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - తొట్టంబేడు: మండలంలోని చిలక వారి కండ్రిగ గ్రామం, హరిజనవాడలో ఆదివారం జనసేన పార్టీ నాయకులు ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లను స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తొట్టంబేడు మండల ఇన్చార్జ్ పేట చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారికి పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ప్రదీప్ కుమార్, మహేష్, మనీ, వేట చిరంజీవి, గోపి తదితరులు పాల్గొన్నారు.